వస్తువంటూ లేనేలేదు. మా యింట్లో నౌకరు కుర్రాడు రాము చాలా చురుకైనవాడు. కాని పరమానందస్వాముల వారి ప్రియశిష్యుడు. నోటంట మాట రావడమే తడవు చేసేశేవాడు.

ఓరోజు మా అమ్మ వాడికి బజారు నుండి తేవలసినసరుకులు చెబుతోంది. వాడు శ్రద్ధగా వింటున్నాడు. ఇంతలో ప్రక్కనే టేబులువద్దనున్న నేను నా ఎక్స్పరిమెంటు ఫెయిలువల్ల బేడ్‌లక్ అన్నాను.

మా రాముగాడు బజారునుంచి తిరిగివచ్చి అమ్మకు సరుకులు అప్పచెప్పి, నా లేబరేటరీరూములో కొచ్చి "బాబుగారూ యిందండి లక్క" అన్నాడు. నేనాశ్చర్యపోయి "యేమి లక్కరా?" అన్నాను. "అదే" బాబు యిందాక అమ్మగారు సరుకులు చెప్పుతున్నప్పుడు మీరు టేబులుకాడినుండి బేడలక్కన్నారు గదటండీ" అన్నాడు. ఇంతలో నాకా యిన్సిడెంటు జ్ఞాపకం వచ్చి, బేడ్‌లక్‌కొచ్చిన తిప్పలా యివని నవ్వుకున్నాను. ఇంతలో మానాన్న ఏంటిరా ఆ నవ్వు అన్నారు. మానాన్న గారికా బేడ్‌లక్ ఇన్సిడెంటంతా చెబితే, తనూ నవ్వటం మొదలెట్టారు. మా యిద్దరి నవ్వులూచూసి మా రాముగాడు తెల్లమొహంవేశాడు.

రాజ్‌కుమార్

* * *

## శివాజీ పాలన

అది నా మూడవ ఫారం చదువుకొనే రోజులు. మాక్లాస్‌కల్లా కొంటె పిల్లోడు ధర్మన్న. డొక్కచీల్చినా అక్షరము రాదు. ఎల్లవేళలా సినిమా పాటలు పాడడం, ఉపాధ్యాయుల వెక్కిరించడం నాలుగు చీవాట్లుతినడం పరిపాటి.

ఆరోజు క్రొత్తగా వచ్చిన హిస్టరీ (చరిత్ర) మేష్టర్ శివాజీనిగూర్చి లెక్చరు దంచేస్తున్నాడు. అరాత్రి మన ధర్మన్న సెకెండ్‌షోకు హాజరు కావటంచే చిన్న కునుకుపట్టింది. మేష్టరేలా గ్రహించాడో మూలనున్న ధర్మన్నను.

అబ్బాయ్! శివాజీనిగూర్చి నాలుగు ముక్కలు చెప్పంటూ ప్రశ్నించాడు. అప్రశ్న పూర్తికాకముందే హస్తముగట్టి వినయవిధేయతతో శివాజీ! నీ పరిమళ పక్కపాడి చాల బాగున్నది. ఇంక కాస్త శ్రద్ధపూనావంటే ఫస్టు క్లాస్‌గా అమ్ముడుపోతాయి. కాస్త జాగ్రత వహించు బాబూ ... అంటూ ముగించాడు. పిల్లలందరు గొల్లున నవ్వారు. మేష్టరుకు నవ్వాలో యేడ్వాలో తెలియక నెంబర్ సెవన్‌లా ఫేస్ మార్చి కుర్చీలో కూలబడ్డారు.

టి. మాణిక్యం

* * *

## సిగ్గు

నేను మా అత్తవారింటికి వెళ్లడము అదే ప్రథమం. నా శ్రీమతి కన్నవారింటనే యున్నది. నాకు ఏమిటో గాని చిన్నప్పటినుండి క్రొత్తవారిని చూచిన, ఆడవాళ్లను చూచిన ఎచ్చటలేని సిగ్గు వచ్చిపడుతుండేది. ఆడవాళ్లకైన అంత సిగ్గు యుండదేమో!

మా అత్తగారు చెంబుతో నీరు యిచ్చి, కాళ్ళుకడుక్కొని భోజనమునకు రమ్మన్నారు. కాళ్ళుకడుగుకొని పీటమీద కూర్చున్నాను. మా అత్తగారు పంచ భక్ష్య పరమాన్నములతో విస్తరియందు వడ్డించారు. నేను తలదించుకొనే భోజనముచేయుచున్నాను. నాకు సిగ్గు ఎక్కువని ముందే చెప్పుకున్నాగా! నా శ్రీమతి తలుపుచాటున నిలుచొని చూస్తున్నది గాబోలు నాకు ఏమిటవసరమో అని! పాయసము చాల బాగుంది గనుక అపారముగా ముగించాము ముగించానోలేదో తిరిగివడ్డించుచుంటె "అహా! వద్దండి అత్తగారు" అన్నాను. పకాలున నవ్వు వినిపించింది. మొఖమెత్తి చూస్తిగదా వడ్డించేది నా శ్రీమతి. "తస్సాదియ్యా నువ్వా" అని రూపాయంత మొఖము చేసుకున్నాను. అప్పటినుండి సిగ్గు వదలుకున్నాను.

డి. పి. కె. పట్నాయక్

* * *

## యుక్తిపరుడు

ఆదినము సోమవారము. నేను ఆచంటకు బస్సులో ప్రయాణము చేయుచున్నాను. ఆ బస్సుడ్రైవరు క్రొత్తగా డ్రైవింగ్ నేర్చుకొన్నాడు. ఇంకా లైసెన్సు యీయలేదు. డ్రైవింగ్ వచ్చుటవల్ల స్పీడుగా వదిలాడు. అకస్మాత్తుగా యొక కోడిపుంజు యొకటి వచ్చి బస్సుక్రిందపడ్డది. ఆకోడిపుంజు దగ్గిరగాయున్న ఒక సామాన్య రైతుది. నే వెళ్ళుచున్న బస్సుడ్రైవరు చనిపోయిన కోడిపుంజునుచూచి అలాగే నిలబడ్డాడు. అతని వాలకము చూచి ప్రయాణికులు ఏడవాలా, నవ్వాలా యన్న సందిగ్ధావస్థయందున్నారు. డ్రైవరునకు చెమట పట్టింది. కారణము లైసెన్సు లేకుండా బస్సు నడుపుచుండుటవల్ల, వెంటనే ఆ సామాన్య రైతుకూడా దగ్గిరకు వచ్చాడు. వాడిని చూచినవెంటనే డ్రైవరు పది రూపాయిలనోటును తీసి గోల చేయకుండా తీసుకొని పో అన్నాడు. ప్రయాణికులంతా అశ్చర్యముగా చూస్తున్నారు. రెండు రూపాయిలపుంజుకు పది రూపాయిలు యీయగానే రైతు సంతోషించి యిలాగన్నాడు. బాబూ ప్రతిదినము మీరు యీత్రోవనే బస్సునడుపుతుండండి. నేను కోళ్లవ్యాపారము పెడతానన్నాడు. ఆమాటలకు డ్రైవరు డంగైపోయాడు.

బి. జి. వి. నరసింహారావు